క్లుప్తంగా

సమాజ సేవలో రోటరీ సేవలు అభినందనీయం



మంగళగిరి: సమాజ సేవలో మంగళగిరి రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. అనూష తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హెల్త్ సెంటర్‌కు శుక్రవారం బీరువా బహూకరించారు. రోగులకు సేవలందించడంలో హెల్త్ సెంటర్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించి, కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్కాస్ సర్టిఫికెట్ పొందడం ప్రశంసనీయమని సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు గాజుల శ్రీనివాసరావు, ఇసునూరి అనిల్ చక్రవర్తి,అందే మురళీ మోహనరావు, ప్రగడ రాజశేఖర్, త్రిపురమల్లు సతీష్, బట్టు నారాయణరావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి



తాడేపల్లి రూరల్: హైకోర్టు నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు హెల్మెట్‌ను, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టును తప్పనిసరిగా ధరించాలని తాడేపల్లి యస్ఐ రమేష్ సూచించారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ వారధి వద్ద శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 90 శాతం మంది తలకు హెల్మెట్టు లేక తీవ్ర గాయమై మరణించిన వారేనని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారికి హెల్మెట్ కవచం లాంటిదని, నిరంతరం దాన్ని వెంటే ఉంచుకోవాలని ఆయన సూచించారు.

12నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12నుంచి 14వరకు అన్ని గ్రామాల పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విమాదేవి శుక్రవారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. 2024-2025వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల అభివృద్ధి, శానిటేషన్, వంటి పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తాడికొండ: ఆటో ఢీకొని తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన తాడికొండ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 6వ తేదీ సాయంత్రం తాడికొండ చింతచెట్టు సెంటర్‌లో గుడిసె దేవదానం(55) నడిచి వెళుతుండగా ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడటంతో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీహెచ్. ప్రభాకర్ తెలిపారు.

పచ్చని చెట్లు మనిషికి ప్రాణాధారం



మేడికొండూరు: పచ్చని చెట్లు మనిషికి ప్రాణాధారం అని యూనివర్సల్ కళాశాల కరస్పాండెంట్ పి.బాలస్వామి అన్నారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఫేస్ సొసైటీ, నెహ్రూ యువ కేంద్రం గుంటూరు ఆధ్వర్యంలో కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. బాలస్వామి మాట్లాడుతూ చెట్లు మానవాళికి ఉపయోగపడతాయన్నారు. చెట్లు నరకడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఉంటాయన్నారు. చెట్లు నాటడం వల్ల భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్ అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరెడ్డి, రమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమేష్, ఫిజికల్ డైరెక్టర్ బి.మద్రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగమణి ఇంటిలో షార్ట్ సర్క్యూట్ జరగలేదు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రకాష్‌నగర్ రెల్లీస్ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఓ వృద్ధురాలు మృతి చెందినట్లు ఫిర్యాదు చేశారని డీఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం వృద్ధురాలు కోడూరు నాగమణి (65) నివాసముంటున్న ఇంటిని పరిశీలించామని చెప్పారు. మీటర్ నుంచి ఆమె నివసించే గదిలోకి వెళ్లిన విద్యుత్ వైర్లు అన్నీ బాగానే ఉన్నాయని, ఫ్యాన్ కూడా మంటల్లో కాలినట్లు ఉందని తెలిపారు. ఆ ఫ్యాన్‌కు ఉన్న విద్యుత్ వైరు కూడా ఏమీ అవలేదని, బహుశా అగ్ని ప్రమాదం జరిగి ఉండడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని ఆయన తెలిపారు. పోలీసులు పోస్టుమార్టం అనంతరం ఆమె మృతికి కారణాలు వెల్లడిస్తామని తెలిపారు. ఆయన వెంట ఏఈ షణ్ముఖ ఉన్నారు.

సామాజిక న్యాయ మహాశిల్పం ధ్వంసం ఘోర తప్పిదం

- ప్రజల దృష్టి మళ్లించేందుకే దాడులు
- లోకేష్ రెడ్‌బుక్ చూపించి భయపెడుతున్నారు.
- వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం



అంబేద్కర్ కాంస్య విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

తాడికొండ: విజయవాడ వేదికగా 125 అడుగుల ఎత్తులో నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, స్మృతి వనం ధ్వంసానికి టీడీపీ నాయకులు యత్నించడం ఘోర తప్పిదమని తాడికొండ మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, తుళ్ళూరు మండల సీనియర్ నాయకులు కొప్పుల శేషగిరిరావు అన్నారు. గురువారం రాత్రి అంబేద్కర్ విగ్రహం వద్ద కరెంటు తీసివేసి టీడీపీ నాయకులు చేసిన ధ్వంసం ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసుకుంటే ఏపీ మరో బంగ్లాదేశ్ అవడం ఖాయమని చెప్పారు. దేశంలో ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విజయవాడ నడిబోడ్డులో సామాజిక న్యాయ శిల్పం నిర్మించి బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు మంచి గౌరవం కల్పిస్తే దానిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు చేస్తున్న దుశ్చర్యలు మంచి పద్ధతి కాదని హితవు పలికారు. జగన్ మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఎప్పుడూ ఇలాంటి దాడుల సంస్కృతిని ప్రోత్సహించలేదని, కానీ టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలపై, వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని ధ్వజమెత్తారు. లోకేష్ రెడ్ బుక్ పేరు చెప్పి భయపెడుతున్నారని, ఈ తంతు ఇదే విధంగా కొనసాగితే ఏపీ బంగ్లాదేశ్‌లా మారక తప్పదని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో కూడా 275 సీట్లకు గాను ప్రతిపక్షాలకు 11 సీట్లు, 268 సీట్లు అధికార పక్షానికి వచ్చాయని తెలిపారు. కానీ ఆరు నెలల వ్యవధిలోనే అక్కడ ఏం జరిగిందో గుర్తు చేసుకొని పరిపాలన కొనసాగిస్తే మంచిదని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, సొసైటీ మాజీ చైర్మన్‌లు వంగా పోలారెడ్డి, ఉయ్యూరు వెంకటరెడ్డి, రాఘవరెడ్డి, జొన్నకూటి ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న రాష్ట్ర యంటమాలజిస్ట్ కన్సలెంట్ పోలు కొండారెడ్డి

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఎర్రబాలెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా సబ్ యూనిట్ అధికారులకు కీటక జనిత వ్యాధులపై పునఃశ్చరణ తరగతుల్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర యంటమాలజిస్ట్ కన్సలెంట్ పోలు కొండారెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల దోమలు, లార్వాలు వృద్ధి అవుతున్నాయని తెలిపారు. జిల్లా సబ్ యూనిట్ అధికారులందరూ అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని చెప్పారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులైన మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులను అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి తటాలం మురళీకృష్ణ సుబ్బరాయణం, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి ధరావత్ రాజునాయక్, తెనాలి అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారులు అందె బాలచంద్రమౌళి, శివగణేష్, చల్లా వెంకటేశ్వర్లు, ఎ. శ్రీమన్నారాయణ, శ్రీకంఠ ఉమాకాంత్, వంగలపున్నారెడ్డి, ప్రశాంత్ కుమార్, టి. సాంబయ్య, బి. వెంకటప్పయ్య, సుధీర్, దస్తగిరి పాల్గొన్నారు.

తుళ్లూరు -1 సీఐగా గంగా వెంకటేశ్వర్లు



తాడికొండ: తుళ్లూరు -1 సీఐగా గంగా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న ఆయన్ను బదిలీలలో భాగంగా మండలానికి కేటాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పటిష్ట బందోబస్తుతో పాటు వీఐపీలకు శాంతిభద్రతల పరంగా అన్ని విధాలా రక్షణ కల్పిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి మంచి సేవలందిస్తానని చెప్పారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కట్టా వెంకటేశ్వరావు ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా గిరిజనుల బతుకుల్లో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితాలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందని, గిరిజనులంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉయ్యాల రామకోటేశ్వరరావు, కుంభా కన్నారావు, ఉయ్యాల శ్రీనివాసరావు, కుంభా కుమారస్వామి, తోకల బాబూరావు, పాలపర్తి కుసుమీరు, శ్రీను, ఉయ్యాల కల్యాణి, సాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెత్త నుంచి విద్యుత్ తయారీపై అవగాహన



సదస్సులో ప్రసంగిస్తున్న ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ రాజేష్

తాడేపల్లి రూరల్: కేఎల్ యూనివర్సిటీలో చెత్త నుంచి విద్యుత్ తయారీపై విజయవాడ, గుణదల అంబిటస్ వరల్డ్ పాఠశాల విద్యార్థులకు ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె. స్వప్న ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి వాడకాలతో పాటు శాస్త్ర సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కారణంగా ఏటా కాలం తీరిన ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలు వందల టన్నులు పారవేస్తున్నారన్నారు. ఫలితంగా ఈ- వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేఎల్‌యూ ప్లానింగ్, డెవలప్‌మెంట్ డీన్ వి. రాజేష్ మాట్లాడుతూ వ్యర్థాల నుంచి కూడా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా కొంత మేర నష్టాన్ని పూడ్చవచ్చని తెలిపారు. సరిగా ఉపయోగించుకుంటే ఈ-వ్యర్థాలు బంగారు కొండలుగా ఉపయోగపడతాయని వివరించారు. అనంతరం సోలార్ విద్యుత్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, అసోసియేట్ డీన్ జె.కె. బ్రహ్మచారి, ప్రొఫెసర్ భానుప్రకాష్, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి. కృష్ణారెడ్డి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస పూజలు



కోటిలింగాల క్షేత్రంలో శ్రీచక్ర పూజల్లో పాల్గొన్న భక్తులు

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణ మాస శుక్రవారాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. వేమవరం గ్రామంలోని కోటి లింగాల క్షేత్రంలో మహాకాళేశ్వరుడు, మహంకాళీ ఆలయంలో స్వామివార్లకు అర్చకులు విశేష పూజలు చేశారు. ముఖ మండపంలో భక్తులు శ్రీచక్ర పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

మూలాంకురేశ్వరికి ఖడ్గమాల పూజ

అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మకు అర్చకులు అయ్యన్నశాస్త్రి విశేష అర్చనలు చేశారు. ఉదయాన్నే పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ముఖమండపంలోని శ్రీచక్రానికి ఖడ్గమాల పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఫిరంగిపురంలోని విజయదుర్గామాతకు అర్చకులు రాజేంద్రశర్మ విశేష అలంకారం చేసి దుర్గామాత అష్టోత్తర, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. వాసవీమాతకు అర్చకులు విశేష అర్చనలు, పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. గీతా భజనమండలి ఆధ్వర్యంలో లలితా సహస్ర నామ పారాయణం చేశారు.

పంట పొలాల పరిశీలన



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెనుమూలిలో వరి పొలాలను దుగ్గిరాల వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష శుక్రవారం పరిశీలించారు. వరి పైరు 15-25 రోజుల దశలో ఉందని, ఈ దశలో ఊద, గడ్డిజాతి కలుపు కలుపు నివారణకు సైహలోఫాస్ వి, బ్యూటైల్ ఎకరాకు 400 మి.లీ. పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. 2-4 డీ సోడియం సాల్ట్ ఎకరాకు 400 గ్రాములు కూడా పిచికారీ చేసుకోవచ్చని వివరించారు. అన్ని రకాల కలుపు మొక్కలను నివారించుకోవడానికి బిస్‌పైరిబ్యాక్ సోడియం 100 మి.లీ. ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు పెంచాలి: డీఈవో

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు రెగ్యులర్‌గా హాజరయ్యే విధంగా పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదేశించారు. మణిపురం సమీపంలోని బొర్రా నాగేశ్వరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించిన అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థులంతా సమయపాలన పాటించే విధంగా పర్యవేక్షించాలని ఉపాధ్యాయుల్ని ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని విద్యార్థులంతా తినే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. భోజన నాణ్యత విషయంలో రాజీపడరాదని సూచించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ జిలానీ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేరళ విపత్తు సహాయనిధి సేకరణ



నిధిని సేకరిస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: కేరళ వయనాడులో కురిసిన భారీ వర్షాలకు ప్రాణాలు కోల్పోయిన వారికి సహాయ నిధి సేకరణను ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ కేరళ వయనాడులో కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడి వందల మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. దాతలు రూ. 18,160ను కేరళ విపత్తు నిధికి సహాయం అందించారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు వి. కృష్ణయ్య, డి. వెంకటరెడ్డి, ఎం. శ్రీనివాసరెడ్డి, డి. భాస్కర్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు వి. దుర్గారావు, కె. కరుణ, కౌలు సంఘం నాయకులు పల్లి కృష్ణ, నీరుడు దుర్గారావు, ఆర్.వి. రాఘవయ్య పాల్గొన్నారు.

తాడికొండలో విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు



వివరాల వెల్లడిస్తున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

తాడికొండ: మండల పరిధిలో శుక్రవారం విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఆర్డీయే సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడులలో పలువురు అధికారులు పాల్గొన్నారు. మొత్తం 39 బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించారు. అక్రమ విద్యుత్ వినియోగ చౌర్యం కేసు ఒకటితో పాటు 131 సర్వీసులకు గాను రూ.6.40 లక్షల అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. దాడులలో అమరావతి ఆపరేషన్ ఈఈ సీహెచ్. రాంబొట్లు, విజిలెన్స్ ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి, ఆపరేషన్ అమరావతి డీఈఈ జి. సురేష్ బాబు, మంగళగిరి ఆపరేషన్ డెప్యూటీ ఈఈ ఎ. సత్యనారాయణ, విజిలెన్స్ ఏడీఈ మల్లికార్జునరావు, తాడికొండ విద్యుత్ ఏఈ ఎస్.వి. రవికుమార్, అమరావతి డివిజన్ ఏఈలు పాల్గొన్నారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులకు బెంగుళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తోన్న శ్రీమద్భగవద్గీతలోని తొమ్మిదో అధ్యాయం- రాజవిద్యా రాజగుహ్య యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారం ముగిశాయి. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడితో తనను భక్తితో పూజించు వారు తనయందు ఉంటారని, వారితో ప్రత్యక్షంగా ఉంటానని తెలిపారని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఫిరంగిపురం: నరసరావుపేట సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పుల్లారెడ్డి శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తాడేపల్లి రూరల్‌లో..

విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం తాడేపల్లి పట్టణ, రూరల్‌లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీఆర్‌యస్ ఫంక్షన్ హాల్ రోడ్డు, కరకట్ట రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తాడేపల్లి మండల పరిధిలోని ప్రాతూరులో ఉదయం 9 నుంచి 12 గంటల సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

దుగ్గిరాలలో....

మండల పరిధిలోని పెదపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని పెదపాలెం, చినపాలెం, పెరికలపూడి, గొడవర్రు, పెదకొండూరు, వీర్లపాలెం, శృంగారపురం, తుమ్మపూడి గ్రామాల్లో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ యస్. సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంగళగిరిలో....

పట్టణ పరిధిలోని ఆంజనేయకాలనీ, వీవర్స్ కాలనీ, తెనాలి ఫ్లైఓవర్, సాయినగర్, గాజుల వారి వీధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, పాత మంగళగిరి, సీతారామ కోవెల, లక్ష్మీ నరసింహ కాలనీ, యస్ఆర్ఐ జంక్షన్, అన్నపూర్ణ థియేటర్ ఏరియాల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, గౌతమ బుద్ధ రోడ్డు పడమరవైపు భగత్‌సింగ్ నగర్, ఈద్గా మసీదు, గ్యాస్ కంపెనీ రోడ్డు, పార్కు రోడ్డు, నిడమర్రు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. మంగళగిరి రూరల్ పరిధి పెదవడ్లపూడిలోని చింతల్ ఏరియా, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు అంతరాయం కలుగుతుందని డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మేడికొండూరులో..

మండలంలోని 14 గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బి.నాగరాజుకుమార్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు అమరావతి, తుళ్ళూరు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడికొండలో

మరమ్మతుల్లో భాగంగా వీఐటీ ఫీడర్, ఉంగుటూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ జి. సురేష్‌బాబు తెలిపారు. అమరావతి మండలం కర్లపూడి, లేమల్లె, ఉంగుటూరు, నెమలికల్లు, మండెపూడి, తుళ్లూరు మండలం రాయపూడి, అనంతవరం, నెక్కల్లు, పెదపరిమి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకుసరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకే 'క్విట్ కార్పొరేట్'

తాడేపల్లి రూరల్: వ్యవసాయ రంగాన్ని, దేశ సంపదను కాపాడుకునేందుకు క్విట్ కార్పొరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో శుక్రవారం ఆల్ ఇండియా కిసాన్ రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వివిధ ప్రజా సంఘాల భాగస్వామ్యంతో క్విట్ కార్పొరేట్ నిరసన, ప్రదర్శనను రైతు సంఘం తాడపల్లి మండల అధ్యక్షులు ఎం. శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతు 2014లో అధికారంలోకి వచ్చే ముందు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని నమ్మించారని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర కల్పిస్తామని అనేక సభల్లో స్వయంగా ఇప్పుడు మాట తప్పారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మూడు నల్లచట్టాలు తీసుకువచ్చారని తెలిపారు. ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం కోసం ప్రయత్నిస్తునన నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ క్విట్ కార్పొరేట్‌కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ నాయకులు వేముల దుర్గారావు, ఏపీ రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, దొంతిరెడ్డి విజయ భాస్కరరెడ్డి, వీరాస్వామి, ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, ప్రజా నాట్యమండలి నాయకులు ఆర్.వి. రాఘవయ్య, కె. కరుణాకర్, రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి రామారావు, సీఐటీయూ యకులు పి. రాఘవులు, కంప వెంకటయ్య, వై. బర్నబాస్, ఏఐటీయూసీ నాయకులు టి. వెంకటయ్య, మహిళా నాయకురాలు మేరీ పాల్గొన్నారు.

రైతు సంఘం, సీఐటీయూల ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం, సీఐటీయూ నాయకులు

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ 2014లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతులకు రెట్టింపు ఆదాయం కల్పిస్తామని చెప్పిందన్నారు. ఆ తర్వాత రైతు వ్యతిరేక చట్టాలను తీసుకవచ్చి భారం మోపిందని విమర్శించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల ధరలను విపరీతంగా పెంచి కార్పొరేట్ శక్తులకు ఆదాయాలు సమకూర్చే విధంగా ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని దినాలు కల్పించి రూ. 600 వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో వున్న వేతన బకాయిల్ని వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జి. శ్రీనివాసరావు, రైతు సంఘం మండల కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరరావు, సీఐటీయూ నాయకులు సీహెచ్. పోతురాజు, సీహెచ్. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్విట్ లిక్కర్.. క్విట్ డ్రగ్స్



విద్యార్థులతో కలసి ప్రదర్శన నిర్వహిస్తున్న ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు

తాడేపల్లి రూరల్: ఆగస్టు 9వ తేదీ క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ క్విట్ లిక్కర్.. క్విట్ డ్రగ్స్ నినాదంతో 60 మంది విద్యార్థులో ప్రదర్శన నిర్వహించామని తెలిపారు. సినిమాలు, సామాజిక మాధ్యమాల్లో అశ్లీల సంభాషణలు, దృశ్యాలు స్త్రీలను కించపరుస్తున్నాయని తెలిపారు. చిన్నపిల్లలు, మైనర్ బాలికలు పెద్దఎత్తున లైంగిక వేధింపుల బారిన పడుతున్నారని, వీటిని అరికట్టడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్పు ఫౌండేషన్ తులసీ పద్మశ్రీ, రామలింగేశ్వరరావు, పద్మావతి, నాగలక్ష్మి, అమలశ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.

తాడికొండలో రైతు సంఘం నాయకులు నిరసన



నిరసన తెలియజేస్తున్న రైతు సంఘాల నాయకులు

తాడికొండ: దేశానికి గుప్పెడన్నం పెట్టే రైతుల ప్రయోజనాలకు తుంగలో తొక్కి కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోదీ ఊడిగం చేస్తున్నారని రైతు సంఘాల నాయకులు మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ శుక్రవారం తాడికొండ పోస్టాఫీసు వద్ద వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముప్పాళ్ల శివ శంకరరావు, రామినేని నరసింహారావు, చింతల భాస్కరరావు, బానావత్ భద్రయ్య, జోషి, కనగాల పూర్ణయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.